క్లుప్తంగా

నూతన కార్యవర్గం ఎంపిక

యర్రగొండపాలెం: మండలంలోని గురిజేపల్లిలో మార్కాపురం బాప్టిస్ట్ ఫీల్డ్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏర్పాటు చేసుకున్నారు. గౌరవ సలహాదారుడిగా బేతం జాన్, గౌరవ డైరెక్టర్‌గా ముండ్ల జాన్ వెంకటయ్య, గౌరవ అధ్యక్షుడిగా ఎనిబెర నాగరాజు, అధ్యక్షుడిగా ముండ్ల సజీవరాజు, ఉపాధ్యక్షుడిగా పి.ఆనందరావు, రికార్డింగ్ కార్యదర్శిగా వై.డేవిడ్, కరస్పాండింగ్ కార్యదర్శిగా వై.ఎవిలిన్‌కుమార్, కోశాధికారిగా కె.రమేష్, కరస్పాండెంట్ ఆర్.ఆనందరావు, సభ్యులుగా పి.పెద్దబాబు, యు.చిన్నశేషయ్య, వి.విల్సన్, కె.యోబు, ఎస్.ఏలియాలు ఏకగ్రీవంగా ఎంపికయ్యారని అసోసియేషన్ తెలిపింది.

నేడు ప్రత్యేక స్పందన

యర్రగొండపాలెం: స్థానిక మండల పరిషత్ కార్యాలయం పరిధిలో ఉన్న బీఆర్ అంబేడ్కర్, బాబు జగ్జీవన్‌రాం ఆడిటోరియంలో కలెక్టర్ దినేష్ కుమార్ ఆధ్వర్యంలో సోమవారం ప్రత్యేక స్పందన కార్యక్రమం జరుగుతుందని తహసీల్దార్ కె.దాస్ తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు జరిగే ఈ కార్యక్రమానికి రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అధ్యక్షత వహిస్తారని తెలిపారు. నియోజకవర్గంలోని పుల్లలచెరువు, త్రిపురాంతకం, పెద్దారవీడు, పెద్దదోర్నాల, యర్రగొండపాలెం మండలాలతోపాటు ఇతర ప్రాంతాలకు చెందిన అర్జీదారులు తమ సమస్యలను పరిష్కరించుకోవచ్చని తెలిపారు.

625 మందికి వైద్య సేవలు



పరీక్షలు చేస్తున్న డా.బ్రహ్మానందరెడ్డి

గిద్దలూరు రూరల్: డా.బ్రహ్మానందరెడ్డి వైద్యశాల, ఒంగోలు కిమ్స్ ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని విశ్వభారతి స్కూల్ ఆవరణంలో డా.బ్రహ్మానందరెడ్డి 625 మందికి ఉచిత వైద్య సేవలను అందించారు. కంటి ఆపరేషన్‌లు 51 మంది, చెవి ముక్కు ఆపరేషన్లు ఆరుగురు, ఇతర ఆపరేషన్ల కోసం 11 మందిని గుర్తించారు. అనంతరం అన్నదానం కార్యక్రమం నిర్వహించారు.

విద్యార్థులకు బహుమతుల పంపిణీ



బహుమతులు అందజేస్తున్న ఎంఈఓ వెంకటేశ్వర్లు

బేస్తవారిపేట: స్థానిక గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన తరగతులు ఆదివారంతో ముగిశాయి. గత నెల రోజులుగా విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లిషు, గ్రామర్, చిత్రలేఖనం, పాటలు, కథలు చెప్పడం కార్యక్రమాలు నిర్వహించారు. పలు అంశాలపై ఆదివారం పోటీ పరీక్ష నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఎంఈఓ జింకా వెంకటేశ్వర్లు, గ్రంథపాలకుడు పీవీ సుబ్బారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నిరంతర అభ్యసనం ముఖ్యం



బహుమతులు అందిస్తున్న విశ్రాంత డిప్యూటీ ఈవో అమరేశ్వరరావు

కొమరోలు: నిరంతరం నిత్య విద్యార్థిలా అభ్యసిస్తేనే కొత్త విషయాలు తెలుసుకోగలమని విశ్రాంత డిప్యూటీ ఈవో అమరేశ్వరరావు తెలిపారు. ఆదివారం గ్రంథాలయంలో మాట్లాడుతూ 35 రోజులపాటు వేసవి సెలవుల్లో నిర్వహించిన విజ్ఞాన శిబిరాన్ని విద్యార్థులు చాలా చక్కగా వినియోగించుకున్నారని తెలిపారు. విజ్ఞాన శిబిరం శిక్షకులు, ప్రభుత్వ ఉపాధ్యాయులు శ్రీధర్‌శర్మ, సుబ్బారావు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఆరో తరగతి ప్రవేశ పరీక్ష



పరీక్ష కేంద్రంలోకి వెళుతున్న విద్యార్థులు

ముండ్లమూరు: స్థానిక ఆదర్శ పాఠశాలలో ఆదివారం నిర్వహించిన ఆరో తరగతి ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ఆదర్శ పాఠశాలలో ప్రవేశం కోసం ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకున్న 142 మంది విద్యార్థుల్లో ప్రవేశ పరీక్షకు 127 మంది హాజరయ్యారు. 80 మంది విద్యార్థులకు మాత్రమే అవకాశం ఉంది. పరీక్షకు హాజరైన విద్యార్థుల్లో ఉత్తమ ఫలితాల ఆధారంగా మెరిట్ జాబితా ఈనెల 17న పాఠశాల నోటీసు బోర్డులు ప్రకటిస్తామని ప్రిన్సిపాల్ కె. పూర్ణచంద్రరావు తెలిపారు.

ఉచిత విద్యతో ఉన్నత చదువులు

- జగనన్న విద్యాదీవెన, వసతి దీవెనతో రాణిస్తున్న విద్యార్థులు
- పల్లెల్లో విద్యా కుసుమాలను పూయిస్తున్న సీఎం వైఎస్ జగన్



నూతన ఉత్సాహంలో విద్యార్థినులు (ఫైల్)

ముండ్లమూరు: రాష్ట్ర ప్రభుత్వం విద్యాభివృద్ధికి కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటోంది. పేదల ఉన్నత విద్యకు తోడ్పాటునందించేందుకు ఉన్నత చదువుల కోసం పూర్తి ఫీజు చెల్లించేందుకు శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా జగనన్న విద్యాదీవెన, వసతి దీవెన పథకాలు ప్రవేశపెట్టి సమర్థంగా అమలు చేస్తోంది. ఆయా పథకాలతో నిరుపేదలైన చాలా మంది విద్యార్థులు ఉన్నత చదువులు చదువుతూ ముందుకు దూసుకెళ్తున్నారు. మెరిట్ ఆధారంగా అన్ని వర్గాల వారికి ప్రోత్సాహకాలు అమలు చేయడంతో అనేక మంది విద్యార్థులకు లబ్ధి చేకూరుతోంది. గత ప్రభుత్వ పాలనలో పేద విద్యార్థులు సకాలంలో ఉపకార వేతనాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ అందక నానా అవస్థలు పడ్డారు. నేడు వైఎస్సార్ సీపీ జగనన్న ప్రభుత్వ పాలనలో ముందుగా ప్రకటించిన సమయానికి నేరుగా తల్లులు, విద్యార్థుల బ్యాంక్ ఖాతాలకు నగదు జమ చేయడంతో సకాలంలో కాలేజీల్లో విద్యార్థులు ఫీజులు జమ చేస్తూ ఆనందంగా చదువుకుంటున్నారు. విద్యార్థులపై ఎలాంటి ఒత్తిడి లేకుండా ప్రభుత్వం నగదు జమ చేసే వరకు కాలేజీలు అవకాశం కల్పిస్తుండటంతో ప్రశాంత వాతావరణంలో విద్యార్థులు విద్యనభ్యశిస్తున్నారు. ఉన్నత చదువు చదువుకొనే సమయంలోనే విద్యార్థులకు నైపుణ్యాన్ని పెంపొందించడం కోసం ఇంటర్న్‌షిప్ కార్యక్రమాన్ని రూపొందించి వారికి ప్రభుత్వం స్కిల్‌డెవలప్‌మెంట్‌పై ఆశక్తి పెంచుతోంది. ప్రభుత్వం అవలంబిస్తున్న అనేక పథకాలను పేద నిరుపేద విద్యార్థులు సద్వినియోగం చేసుకొని ఆయా రంగాల్లో ప్రగతి సాధిస్తూ ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకుంటున్నారు.



జగనన్న పాలనలో చాలా సంతోషంగా చదువుకుంటున్నాం. మాది ముండ్లమూరు మండలం రమణారెడ్డిపాలెం. మా తల్లిదండ్రులు ధనలక్ష్మి, శింగయ్యలు రోజు వారి కూలి చేసుకుంటూ జీవనం సాగిస్తుంటారు. నిరుపేద కుటుంబం. నేను ఇంటర్మీడియెట్ ఒంగోలులో పూర్తి చేశా. అప్పట్లో అరకొర స్కాలర్‌షిప్ రావడంతో అతి కష్టంతో చదివించారు. అనంతరం ఎంసెట్‌లో ర్యాంక్ రావడంతో విజయవాడ దగ్గరలోని అమృతసాయి ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కాలేజీలో సీటు వచ్చింది. పేద విద్యార్థులకు పూర్తిగా ఫీజు చెల్లించేందుకు జగనన్న విద్యాదీవెన, వసతి దీవెన పథకాలను ప్రవేశ పెట్టడంతో పూర్తి సహాయ సహకారాలు అందాయి. విద్యాదీవెన ద్వారా పూర్తి ఫీజు ఏడాదికి రూ.35 వేలు, వసతి దీవెన ద్వారా ఏడాదికి రూ.20 వేలు లభించడంతో తల్లిదండ్రులపై ఎలాంటి భారం లేకుండా పోయింది. దీంతో కుటుంబ సభ్యులందరం సంతోషంగా ఉంటున్నాం.

గోపనబోయిన లింగారావు, బీటెక్ విద్యార్థి, రమణారెడ్డిపాలెం



ఉన్నత చదువులు జగనన్నతోనే సాధ్యం. మాది పేద కుటుంబం. తల్లి రమాదేవి కూలి పని. తండ్రి చిరు ఉద్యోగి. నేను బీఫార్మసీ ఒంగోలులో చదివినప్పుడు సకాలంలో ఫీజు రీయింబర్స్ రాక చాలా ఇబ్బంది పడ్డా. అప్పట్లో వసతి దీవెన లేదు. నామ మాత్రపు స్కాలర్ షిప్ వచ్చేది. అది కూడా సకాలంలో రాదు. తల్లిదండ్రులపై ఆధారపడి చదివా. అతి కష్టం మీద ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొని బీఫార్మసీ పూర్తి చేశా. ఖర్చు ఎక్కువ కావడంతో తల్లిదండ్రులు చదివించలేమన్నారు. ఎంఫార్మసీలో కృష్ణా యూనివర్సిటీ మచిలీపట్నంలో సీటు సాధించా. జగనన్న ప్రభుత్వం పేద విద్యార్థులకు పూర్తి ఫీజు చెల్లించేందుకు జగనన్న విద్యాదీవెన పథకంతో ఏడాదికి లక్షా పది వేల రూపాయలు కాలేజీ ఫీజు ప్రభుత్వం నేరుగా మా ఖాతాలో జమ చేసింది. ఇప్పటికి రెండు సార్లు జమ చేసింది. జగనన్న వసతి దీవెనలో భాగంగా అక్కడే బాలికల వసతి గృహంలో సీటు రావడంతో పూర్తిగా ప్రభుత్వమే చెల్లించింది. దీంతో పైసా ఖర్చు లేకుండా ఎంఫార్మసీ చదువుతున్నా. మా చెల్లి క్రాంతి బాపట్ల వ్యవసాయ కళాశాలలో అగ్రికల్చర్ బీఎస్సీ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. మా చెల్లికి విద్యాదీవెన, వసతి దీవెన వస్తోంది. తల్లిదండ్రులపై ఎలాంటి భారం లేదు. ఇలాంటి ప్రభుత్వంతోనే పేద విద్యార్థుల ఉన్నతి విద్య సాధ్యమవుతుంది. జగనన్నకు రుణపడి ఉంటాం.

జి.సౌజన్యదీప్తి, ఎం.ఫార్మసీ, వేములబండ

దివ్యాంగులకు చేయూత



మోటారు ట్రై సైకిల్‌ను అందిస్తున్న మంత్రి ఆదిమూలపు సురేష్

యర్రగొండపాలెం: రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక అవసరాలు కలిగిన వారికి అన్ని విధాల చేయుత అందిస్తుందని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. ఆదివారం మండలంలోని వై.కొత్తపల్లికి చెందిన వనిపెంట పుల్లారెడ్డికి మోటారు ట్రై సైకిల్ అందించారు. మండల పార్టీ అధ్యక్షుడు కొప్పర్తి చిన్న ఓబులరెడ్డి, సచివాలయాల మండల కన్వీనర్ సయ్యద్ షాబీర్ బాషా, సర్పంచ్‌ల సంఘం జిల్లా అధ్యక్షుడు దుగ్గెంపూడి సుబ్బారెడ్డి, చిలకల అంకిరెడ్డి, బి.బాలచెన్నయ్య పాల్గొన్నారు.

గ్రంథాలయాలు ఆధునిక దేవాలయాలు

– వయోజన విద్య విశ్రాంత ఆర్‌జేడీ వీరారెడ్డి



బహుమతులు అందిస్తున్న వీరారెడ్డి, మధుసూధన్, శివారెడ్డి తదితరులు

మార్కాపురం: గ్రంథాలయాలు ఆధునిక దేవాలయాలని వయోజన విద్య విశ్రాంత రీజినల్ జాయింట్ డైరెక్టర్ అన్నపురెడ్డి వీరారెడ్డి పేర్కొన్నారు. నెల రోజులుగా పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరం ముగింపు కార్యక్రమం ఆదివారం గ్రంథ పాలకుడు జీవీ శివారెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి గ్రంథాలయానికి వచ్చి చదవడం అలవాటు చేసుకోవాలని సూచించారు. సాధన డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.మధుసూదన్ మాట్లాడుతూ.. విద్యార్థుల్లో పఠనాసక్తిని పెంచేందుకు నెలరోజుల పాటు గ్రంథాలయంలో విజ్ఞాన శిబిరాన్ని నిర్వహించిన గ్రంథ పాలకుడు శివారెడ్డిని అభినందించారు. ప్రభుత్వ ప్రోత్సాహంతో ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమానికి తులసి, అపర్ణ, రేవతి, లావణ్య, శిరీష, విజయలక్ష్మి తదితరులు సహకారం అందించారని శివారెడ్డి చెప్పారు. వారిని ఘనంగా సన్మానించారు. విద్యార్థులకు భగవద్గీత పుస్తకాలను అపర్ణ అందించారు.

యోగాతో రాజయోగం



యోగా ప్రాముఖ్యతను వివరిస్తున్న యోగా శిక్షణ నిపుణుడు గురూజీ శ్రీరామ్



యోగా తరగతులలో పాల్గొన్న మహిళలు, ప్రజలు

తాళ్లూరు: యోగాతో మానసిక ప్రశాంతత వస్తుందని యోగా శిక్షణ నిపుణుడు శ్రీరామ్ గురూజీ అన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్ ఎదురుగా విద్యా నికేతన్ యోగా పాఠశాలలో ఆదివారం యోగా శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. శ్రీరామ్ గురూజీ మాట్లాడుతూ యోగాతో దీర్ఘకాలిక వ్యాధులు సైతం అంతం అవుతాయని చెప్పారు. మనస్సు, శరీరం రెండూ అనుసంధానంమే యోగ లక్ష్యమని చెప్పారు. శరీరం, ఆత్మల ప్రాముఖ్యత గురించి, పలు యోగాసనాల ప్రాముఖ్యతను వివరిస్తూ యోగసనాలు చేయించారు. యోగాతో పలు ఆటలకు, శాస్త్రయుక్తంగా కుటుంబ సభ్యులతో కలిసి చేయించారు. యోగాతో పొందిన ప్రయోజనాలను ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు వివరించారు. వైస్ ఎంపీపీ ఐ.వెంకటటేశ్వర రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ ఐ. రమాదేవి, రిటైర్డ్ ఉద్యోగ సంఘ జిల్లా సంయుక్త కార్యదర్శి ఐ. వెంకట రెడ్డి, హెచ్‌ఎం క్రిష్టారెడ్డి, జేసీఎస్ కేవీ పాలెం కన్వీనర్ కొత్రపాటి విష్ణు, పలువురు ఆర్యవైశ్య ప్రముఖులు రవి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

నేటి నుంచి పాఠశాలలు పునఃప్రారంభం



లింగారెడ్డి కాలనీలో తల్లిదండ్రులతో ర్యాలీ నిర్వహిస్తున్న హెచ్‌ఎం

మార్కాపురం: వేసవి సెలవుల అనంతరం సోమవారం నుంచి పాఠశాలలు ప్రారంభం కానున్నాయి. తొలిరోజు నుంచే విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లు అందించేందుకు ఏర్పాట్లు చేశారు. మార్కాపురం మండలంలో మొత్తం 145 స్కూళ్లు ఉండగా, అందులో 93 ప్రభుత్వ పాఠశాలలు. సుమారు 12 వేల మంది విద్యార్థులు పాఠశాలల్లో చదువుకుంటున్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలతోపాటు ఏపీ మోడల్ స్కూల్, కస్తూర్బా పాఠశాల, బీసీ, ఎస్సీ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలు కూడా ప్రారంభం కానున్నాయి. వేసవి తీవ్రత ఎక్కువగా ఉన్నందున ఈ నెల 17వ తేదీ వరకు ఉదయం 7.30 నుంచి 11.30 గంటల వరకు పాఠశాలలు నిర్వహించనున్నారు. విద్యా కానుకలు ఇచ్చేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని, ఎంఈఓ రాందాస్ నాయక్ చెప్పారు.

నూరు శాతం హాజరుకావాలి

తర్లుపాడు: పాఠశాలలకు పిల్లలందరూ నూరు శాతం హాజరయ్యేలా తల్లిదండ్రులు సహకరించాలని లింగారెడ్డి కాలనీ పాఠశాల హెచ్‌ఎం షేక్ మౌలాలి కోరారు. కాలనీలో ఇంటింటికీ తిరుగుతూ తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పీఎంసీ చైర్మన్ కె.రవి, వైస్ ప్రెసిడెంట్ దేవదాసు, ఉపాధ్యాయుడు వి.శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

20 మంది అనుమానితులు బైండోవర్

మార్కాపురం: మార్కాపురం పట్టణంలో అర్ధరాత్రి సమయంలో రోడ్లపై అనుమానాస్పదంగా తిరుగుతున్న 20 మందిని పోలీస్ స్టేషన్‌కు తరలించి బైండోవర్ చేసినట్లు పట్టణ ఎస్సై శశికుమార్ ఆదివారం సాయంత్రం విలేకర్లకు తెలిపారు. గత మూడు రోజులుగా రాత్రి 11 గంటల నుంచి తెల్లవారుజామున 4 గంటల వరకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నామన్నారు. అనవసరంగా అర్ధరాత్రి సమయంలో రోడ్లపై తిరగవద్దని హెచ్చరించారు. ఎవరైనా వేరే ఊర్లకు వెళ్లే సమయంలో పోలీసులకు సమాచారం ఇస్తే ఆ ఇంటిపై నిఘా ఉంచుతామని చెప్పారు. ఇళ్ల వద్ద అనుమానితులు సంచరిస్తే వెంటనే మహిళా పోలీసులకుగానీ, స్టేషన్‌లోగానీ సమాచారం ఇవ్వాలని సూచించారు.

ఘనంగా బ్రహ్మంగారి విగ్రహ ప్రతిష్ఠ



విగ్రహ పత్రిష్ఠ మహోత్సవంలో ఎమ్మెల్యే

గిద్దలూరు రూరల్: మండలంలోని బురుజుపల్లెలో శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవంలో స్థానిక ఎమ్మెల్యే అన్నా రాంబాబు ఆదివారం పాల్గొని ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఎమ్మెల్యేకు ఆలయ నిర్వాహకులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఎడ్ల పోటీలను ప్రారంభించారు. వైఎస్సార్ సీపీ నాయకులు రంగారెడ్డి, పిడుగు శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

ముగిసిన సమ్మర్ క్యాంప్



బహుమతులతో చిన్నారులు

యర్రగొండపాలెం: స్థానిక శాఖ గ్రంథాలయంలో చిన్నారుల కోసం ఏర్పాటు చేసిన సమ్మర్ క్యాంప్ ఆదివారం ముగిసింది. ఈ సందర్భంగా గ్రంథపాలకురాలు కె.ఝాన్సీ మాట్లాడుతు విద్యార్థులు ఎండలలో బయట తిరగకుండా, తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవటానికి రాష్ట్ర ప్రభుత్వం గతనెల 8 నుంచి ఈనెల 11వ తేదీ వరకు ఏర్పాటు చేసిన సమ్మర్ క్యాంప్‌ను అనేక మంది విద్యార్థులు సద్వినియోగం చేసుకున్నారన్నారు. పుస్తక పఠనం, చిత్రలేఖనం, నృత్యాలు, స్పీచ్‌లు, ఆటల పోటీలలో చిన్నారులు ఎంతో ఉషారుగా పాల్గొని తమ విజ్ఞానాన్ని పెంపొందించుకున్నారని చెప్పారు. అనంతరం సర్పంచ్ ఆర్.అరుణాబాయి చిన్నారులకు బహుమతులు అందించారు.

అర్ధవీడు (కంభం): మండల కేంద్రంలోని గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన వేసవి విజ్ఞాన శిబిరాలు ఆదివారం ముగిశాయి. 35 రోజుల పాటు జరిగిన శిక్షణ శిబిరంలో ఇంగ్లిషు, తెలుగు కథలు రాయడం, చదవడం, చదరంగం, డ్రాయింగ్, ఇతర గేమ్స్‌లో విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. బహుమతులు అందజేశారు. గ్రంథపాలకుడు శ్రీధర్ రెడ్డి, ఉపాధ్యాయులు శ్రీనివాస్, పాపయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

భక్తిగీతాల పోటీలో విజేతలకు బహుమతులు



విజేతలతో కమిటీ ప్రతినిధులు

మార్కాపురం టౌన్: పట్టణంలోని నెహ్రూ బజార్ సాయిబాబా మందిరంలో గురుపౌర్ణమి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం చిన్నారులకు నిర్వహించిన భక్తిగీతాల పోటీల్లో విజేతలకు మందిర కార్యదర్శి గోపాలుని హరిహరరావు, కమిటీ ప్రతినిధుల చేతులమీదుగా బహుమతులు అందజేశారు. ఈ పోటీల్లో సుమారు 50 మందికి పైగా చిన్నారులు పాల్గొన్నారు. గురు పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని బాబా మందిరంలో నెల రోజుల పాటు వివిధ కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో యువసేవ సమాజ్ అధ్యక్షుడు గోపాలుని కృష్ణమోహన్, గాయకుడు జిల్లెల వెంకటేశ్వర్లు, చిత్తారి రంగ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

కొనకనమిట్ల: మండలంలోని వాగుమడుగు పంచాయతీ అంబాపురం గ్రామంలో ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం 5 గంటలకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ మోరా శంకర్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసులరెడ్డి, ఎంపీపీ మోరబోయిన మురళీకృష్ణయాదవ్, జెడ్పీటీసీ అక్కిదాసరి ఏడుకొండలు పాల్గొంటారని తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ శ్రేణులు పాల్గొనాలని కోరారు.

ఘనంగా వెంకటేశ్వరస్వామి నగరోత్సవం



అశ్వ వాహనంపై దర్శనమిస్తున్న స్వామివారు

మార్కాపురం: పట్టణంలోని కంభం రోడ్డులో ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామివారి నగరోత్సవం వైభవంగా నిర్వహించారు. స్వామివారిని అశ్వవాహనంపై పురవీధుల్లో ఊరేగించారు. భక్తుల గోవింద నామ స్మరణ మధ్య జరిగిన ఈ ఉత్సవంలో మహిళల కోలాట ప్రదర్శన, భజన బృందం కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అధ్యక్షుడు రావిపాటి రామారావు, కార్యదర్శి శివ శంకర్, నిట్టూరి రమేష్ తదితర కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

గుంటి గంగా భవానికి విశేష పూజలు



అలంకరించిన గుంటి గంగా భవాని అమ్మవారు

తాళ్లూరు: జిల్లాలో ప్రసిద్ధి చెందిన గుంటి గంగా భవాని అమ్మవారికి ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని పొంగళ్లు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. పూజారులు విజయలక్ష్మి, ప్రకాశరావు ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. అమ్మవారికి భక్తులు ఆరు చీరలు బహూకరించారు. ఆలయానికి రూ. 14,360 ఆదాయం వచ్చినట్లు ఆర్‌ఏ శ్రీనివాసరావు తెలిపారు. ఈఓ భాస్కర్ రెడ్డి, ఆలయ అధికారి శ్రీనివాసరావు పర్యవేక్షించారు.

భక్తిశ్రద్ధలతో విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు



దేవతా విగ్రహాలకు భక్తుల పూజలు

కొనకనమిట్ల: మండలంలోని తువ్వపాడు గ్రామంలో రామచంద్రస్వామి జీవ, ధ్వజ, పోతురాజుస్వామి సహిత పోలేరమ్మ, అభయాంజనేయస్వామి విగ్రహ, శిఖర, కళశ, ఆదిత్య నవగ్రహ దేవతామూర్తుల విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఆదివారం వేదపండితుల మంత్రోచ్ఛారణ, మంగళ వాయిద్యాల నడుమ నవగ్రహారాధన, వాస్తు దేవతారాధన, జీవ హోమార్చన, పారాయణం, గ్రామ బలిహరణ, రుద్ర హోమాలు, క్షీరాధివాసం, సహస్రనామ పూజలను వేదపండితులు ఓరుగంటి సీతారామశర్మ ఆధ్వర్యంలో అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని నైవేద్యాలు సమర్పించారు. రాత్రికి కోలాటం ప్రదర్శించారు.

సోషల్ మీడియా పోస్టుపై ఆందోళన



బస్టాండ్ సెంటర్‌లో మానవహారంగా ఏర్పడిన యువకులు

యర్రగొండపాలెం: సోషల్ మీడియాలో వచ్చిన పోస్టుపై ఒక సామాజిక వర్గానికి చెందిన వారు ఆదివారం రాత్రి ఆందోళనకు దిగారు. వివరాల్లోకి వెళితే..యర్రగొండపాలెంకు చెందిన ఒక యువకుడు రెండు సామాజిక వర్గాలను కించపరుస్తూ సోషల్ మీడియాలో పోస్టు చేశాడు. అసభ్యకరంగా పోస్టు చేసిన యువకుడిని అరెస్టు చేసి చట్టపర చర్యలు తీసుకోవాలని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అనంతరం స్థానిక వైఎస్సార్ విగ్రహం వద్ద ఆందోళనకు దిగారు. మానవహారంగా ఏర్పడి దాదాపు గంటసేపు రాకపోకలను స్తంభింపచేశారు. ఈ పోస్టు గురించి తెలుసుకున్న మరో సామాజిక వర్గానికి యువకులు పోలీస్‌స్టేషన్ వద్దకు చేరుకొని తాము కూడా ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. నిందితుడిని వెంటనే అరెస్టు చేస్తామని డీఎస్పీ వీరరాఘవరెడ్డి, ఎస్సై జి.కోటయ్య హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు.

పోలేరమ్మ తల్లికి పూజలు

మార్కాపురం టౌన్: పట్టణ శివారులో కొలువై ఉన్న అల్లూరి పోలేరమ్మ ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని మూలవిరాట్‌ను ఆలయ అర్చకుడు వెంకటేశ్వర్లు ప్రత్యేకంగా అలంకరించి కుంకుమార్చన, అభిషేకాలు చేశారు. ఏర్పాట్లను ఆలయ ఈవో చెన్నకేశవరెడ్డి, ధర్మకర్తలు, ఆలయ సిబ్బంది శ్రీధర్‌రెడ్డి తదితరులు పర్యవేక్షించారు.

మేళా విజయవంతం చేయండి

తాళ్లూరు: ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా గుంటూరు లాంఫాంలో సోమవారం నిర్వహించనున్న విత్తన మేళా విజయవంతం చేయాలని వ్యవసాయాధికారి ప్రసాదరావు కోరారు. ఎన్. జి రంగా విశ్వవిద్యాలయం అభివృద్ధి పరచిన నూతన రకాల వంగడాలు, రైతులు మన్ననలు పొందిన కరాలను అందుబాటులో ఉంచారని చెప్పారు. మృగశిర కార్తె ప్రారంభమైనందున రాబోవు తొలకరి వర్షాలకు అన్నదాతలకు సాగుకు బాసటగా నిలుస్తాయని చెప్పారు.